సాక్షి
ములుగు

సోమవారం । 3 । మార్చి । 2025



సస్యరక్షణతో అధిక దిగుబడి
ప్రస్తుతం మామిడి పూత నుంచి గోలి కాయ దశ వరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి సూచనలు చేశారు.
- 8లో



పోస్టల్ సేవలు ప్రియం
బుక్‌పోస్టలపై వార, పక్ష, మాస ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడాపై ధరలు భారీగా పెరగడంతో పాఠకులు ఆందోళనకు గురవుతున్నారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
36°/21°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి గాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ 6:28	మంగళ 5:10

న్యూస్‌రీల్

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం



ములుగు/ములుగు రూరల్: సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం పెంపొందుతుందని సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా నుంచి మొత్తం 50 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 24 మంది రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ పోరిక అసిలాల్, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్ శ్రీరామ్‌నాయక్, సభ్యులు మోహన్‌లాల్, ఆనంద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘననివాళి



ములుగు: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి కలెక్టరేట్ ఏఓ రాజుకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి పీజీ కోర్సుల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5, 7, 10, 12, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జలుబు, నిమ్ముతో పసికందు మృతి

- ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమని తల్లిదండ్రుల ఆరోపణ


మృతి చెందిన పసి పాప

వాజేడు: దగ్గు, జలుబు, నిమ్ముతో ఇబ్బంది పడుతున్న పసికందుకు ఆస్పత్రి సిబ్బంది వ్యాక్సిన్ ఇవ్వకపోవడంతో మృతి చెందినట్లు బాధిత తల్లిదండ్రులు గోగు బాలకృష్ణ, భారతి తెలిపారు. మండల పరిధి గుడిసెల కాలనీలో ఆదివారం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గోగు బాలకృష్ణ, భారతి దంపతుల స్వగ్రామం చంద్రుపట్ల. వీరికి మూడో సంతానమైన కూతురుకు(55 రోజులు) దగ్గు, జలుబుతో పాటు నిమ్ము చేరగా వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. శిశువుకు 45 రోజులకు వేయాల్సిన వ్యాక్సిన్ ఇవ్వకుండా వారం తర్వాత రమ్మని చెప్పగా తిరిగివెళ్లిపోయారు. అప్పటికే నిమ్ము ఎక్కువైంది. దీంతో ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షలు చేసిన వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్థానిక ఆర్‌ఎంపీకి చూపించగా సిరప్ ఇచ్చి పంపించాడు. అయినా పసికందు ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఆదివారం వాజేడు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ఈ విషయంపై ఆయనను వివరణ కోరగా వారం రోజుల ముందు ఇక్కడికి వచ్చారని, ఆ సమయంలో పాపకు నిమ్ము ఎక్కువ ఉండడంతో ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. వ్యాక్సిన్ అందక పాప మృతి చెందలేదని, వ్యాధుల ముందస్తు నివారణకు వ్యాక్సిన్ వేస్తామని వివరించారు.

కళాశాలలో పరీక్షలను తనిఖీ చేస్తున్న డీఐఈఓ చంద్రకళ (ఫైల్)



సర్వం సిద్ధం

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- ఈనెల 5 నుంచి వార్షిక పరీక్షలు
- జిల్లాలో 10 కేంద్రాల ఏర్పాటు

ఏటూరునాగారం: మార్చి 5వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 9 మండలాల్లో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా విద్యుత్ దీపాలు, బెంచీలు, తాగునీటి వసతికి చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలకు చేతి గడియారంతో సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్ల అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థి పరీక్ష రాయలేని స్థితిలో ఉంటే బోర్డు అధికారులు ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న వారికి సహాయకులను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించనున్నారు.

సీసీ కెమెరాల నిఘా..
కేంద్రాల్లో సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు రాసే కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దాని ద్వారా బోర్డు అధికారులు పర్యవేక్షణ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష గదిలోకి అనుమతించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోస్తు ఏర్పాటు చేసి అనుమతి లేని వ్యక్తులు లోనికి రాకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల వివరాలు

	బాలిక	బాలురు
ఇంటర్ ఫస్ట్ ఇయర్	832	877
ఇంటర్ సెకండ్ ఇయర్	802	833
ఒకేషనల్ ఫస్ట్ ఇయర్	170	71
ఒకేషనల్ రెండో సంవత్సరం	152	56
మొదటి సంవత్సరం మొత్తం విద్యార్థులు	1,950	
ద్వితీయ సంవత్సరం మొత్తం విద్యార్థులు	1,843	

పరీక్ష కేంద్రాలు ఇవే..
- వాజేడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ములుగు ప్రభుత్వ కళాశాల
- ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ఏటూరునాగారంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర కళాశాల
- గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల
- మంగపేట ఎక్మెటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ కాలేజీ
- జాకారంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల
- బండారుపల్లిలోని మోడల్ స్కూల్
- తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల
- వెంకటాపురం(ఎం) ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఏర్పాట్లు పూర్తి చేశాం..
ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేశాం. బోర్డు నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించేందుకు ఆయా కళాశాలల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రత్యేక అధికారులు, స్క్వాడ్ కూడా ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సహకారం తీసుకుంటాం. విద్యార్థులు సమయంలోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
- చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారిణి

రామప్పలో సండే సందడి


రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పర్యాటకులు, విద్యార్థులు


శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయంలో సండే సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్.. పర్యాటకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. విద్యార్థులు నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ఆలయ ఆవరణలోని శివలింగం వద్ద కొబ్బరికాయలు కొట్టి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలి

ఎండీ అమ్జద్ పాషా


రైతులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

ములుగు రూరల్: మిర్చి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్ పాషా అన్నారు. మండలంలోని కాశిందేవిపేట, దేవగిరిపట్నం గ్రామాల్లో మిర్చి కల్లాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో మిర్చి సాగు అవుతుందన్నారు. ఎకరా విస్తీర్ణంలో మిర్చి పంట సాగుకు సుమారు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడితో సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి పంటకు నల్లి, వేరుకుళ్లు రావడంతో పంట పూర్తిగా దిగుబడి తగ్గిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి పంటను కొనుగోలు చేసి క్వింటాకు రూ.25 వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. లేనిపక్షంలో మిర్చి రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తోట భాస్కర్, నర్సింహరావు, శ్రీకాంత్, నరేష్, ప్రభాకర్, మహేందర్, మల్లేష్, మొండయ్య, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టు' రహిత జిల్లా లక్ష్యం

ఎస్పీ శబరీశ్



ఏటూరునాగారం: మావోయిస్టు రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని ఎస్పీ శబరీశ్ తెలిపారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2001 సంవత్సరంలో ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌పై అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ ట్రాక్టర్లలో డైరెక్షన్ మైన్స్ అమర్చి దాడి చేశారని, ఈ ఘటనలో ఒక సాధారణ పౌరుడు, ఫారెస్ట్ అధికారి, ముగ్గురు పోలీసులు మరణించారు. పోలీస్ స్టేషన్ భద్రత చర్యల్లో భాగంగా పోలీస్ స్టేషన్ ముందు నుంచి వెళ్లే 163 ప్రధాన రహదారి మూసివేసి వాహనాల రాకపోకలను ఐటీడీఏ గెస్ట్‌హౌజ్ ఎదురు నుంచి ఏటూరునాగారం వైపు మళ్లించినట్లు తెలిపారు. ఈ మధ్య కాలంలో జరిగిన వరుస పోలీస్ ఎదురు కాల్పుల్లో సీపీఐ మావోయిస్టు ముఖ్య నాయకులతోపాటు జేఎండబ్ల్యూపీ డివిజనల్ కమిటీకి చెందిన ఏటూరునాగారం–మహాదేవపూర్ ఏరియా కమిటీ చెందిన దళం, ఇల్లందు– నర్సంపేట దళం పూర్తిగా లేకుండా పోయిందని తెలిపారు. జిల్లాలో సీపీఐ మావోయిస్టు పార్టీ కదలికలు పూర్తిగా అంతరించి పోయినందున సామాన్య ప్రజల సౌకర్యార్థం 25 ఏళ్ల తర్వాత ఏటూరునాగారం పోలీసులు జాతీయ రహదారికి అడ్డుగా ఉన్న గేట్లు తెరచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల కోలాహలం

మంగపేట: మండలంలోని మల్లూరు హేమాచలున్ని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో ఆదివారం సందడి నెలకొంది. ఉదయాన్నే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో గుట్టకు చేరుకున్నారు. ఆలయ ప్రాంతంలోని చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి అత్యంత భక్తి శ్రద్ధలతో స్వయంభూ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతాన ప్రాప్తికోసం వచ్చిన దంపతులు ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామి వారి నాభి ప్రసాదం స్వీకరించారు.


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వసంతోత్సవానికి వీడ్కోలు

నిట్ వరంగల్‌లో మూడు రోజులు నిర్వహించిన వసంతోత్సవం 'స్ప్రింగ్ స్ప్రీ–25' వేడుకలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు పోలరాయిడ్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, క్యూ ఫ్యాక్టర్, థింక్ డ్రాప్ రివీల్, పిక్చర్ పజిల్, సోలో ఐడల్, నుక్కడ్ నాటక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి సింగర్ నిఖిల్ డిసౌజా పాటలకు విద్యార్థులు స్టెప్పులేసి కేరింతలు కొట్టారు.
- కాజీపేట అర్బన్
- 8లో







పాట పాడుతున్న సింగర్ నిఖిల్ డిసౌజా.. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీస్తూ కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఎత్తిపోతలు.. ఎప్పటికో..!

దేవాదుల మూడో దశకు భూసేకరణే అసలు సమస్య
- ఇరవయ్యేళ్లయినా అసంపూర్తిగానే ప్రాజెక్టు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రుల పర్యటన
- హామీలు, ఆదేశాలు.. అయినా పూర్తికాని భూసేకరణ
- రూ.6వేల కోట్ల నుంచి రూ.17,500 కోట్లు.. పెరిగిన అంచనా వ్యయం

దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు 2026 మార్చిలోపు వందశాతం పూర్తి చేసి.. అదే నెలలో సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సమ్మక్క సారక్క బరాజ్ ఎన్‌ఓసీ కోసం ఛత్తీస్‌గఢ్ సర్కారును ఒప్పిస్తాం. ధరలు పెరగడం వల్ల ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణకు ఇబ్బందిగా మారింది. అయినా వెంటనే చేపట్టి దేవాదుల పూర్తి చేస్తాం.
- 2024 ఆగస్టు 31న ములుగు జిల్లా కన్నాయిగూడెంలో సమీక్ష సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన మాటలివి.



ధర్మసాగర్‌లో దేవాదుల ఎత్తిపోతల పథకం రిజర్వాయర్

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని తొమ్మిది జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం.. ఇరవయ్యేళ్లయినా అసంపూర్తిగానే ఉంది. మూడో దశలో భూసేకరణ చేపట్టని కారణంగా సుమారు ఆరేళ్లుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టు 91 శాతం వరకు పూర్తయినట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతుండగా.. కీలకమైన 9 శాతం పనులు పూర్తి చేయడానికి భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఉన్నతాధికారులు 2024 ఆగస్టులో ప్రాజెక్టును పరిశీలించారు. సమీక్ష నిర్వహించి వెంటనే భూసేకరణ చేపట్టి పూర్తి చేస్తామని ప్రకటించినా.. ఆదిశగా అడుగులు పడలేదు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్..
జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2004లో శ్రీకారం చుట్టింది. తొమ్మిది జిల్లాల్లో సుమారు 5.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ఎక్సర్‌సైజ్ మూడోదశను దాటించలేకపోతున్నది. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతోపాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల పరిధి 37 మండలాలకు చెందిన 5,56,722 ఎకరాలకు నీరందించడం లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది. మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది.

భూసేకరణే సమస్య..
ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి రైతులు ఎక్కువ పరిహారం డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి అడ్డంకిగా మారాయి. ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం విపరీతంగా పెరుగుతోంది. మొత్తం 33,224 ఎకరాలకు 30,268 ఎకరాలు సేకరించగా.. జనగామ నియోజకవర్గంలో 945 ఎకరాలు, పాలకుర్తిలో 826, గజ్వేల్‌లో 230, నర్సంపేటలో 131, వర్ధన్నపేటలో 168 ఎకరాలు.. ఇలా 2,957 ఎకరాల సేకరణ జరగాల్సి ఉంది.

పెరిగిన అంచనా వ్యయం
2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,729.98 కోట్లకు పెరిగింది. మూడు దశల్లో 16 ప్యాకేజీల్లో చేపట్టిన ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.14,188 కోట్లు ఖర్చయినట్లు అధికారులు వెల్లడించారు. 2024 ఆగస్టు 31న ములుగు జిల్లా కన్నాయిగూడెంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన తర్వాత భూసేకరణతో పాటు ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరోసారి అంచనాలు పెంచి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు.

అయితే ఈమేరకు అధికారులు రూ.17,500 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచడం.. లేదంటే రైతులను ఒప్పించడం.. ఏదో ఒకటి జరిగితేనే భూసేకరణ ముందుకు సాగి.. ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉంది.

జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వివరాలు

లిఫ్టు చేయాల్సిన నీరు	: 60.00 టీఎంసీలు
వ్యవసాయానికి నీరు	: 56.71 టీఎంసీలు
తాగునీటి వినియోగం	: 2.97 టీఎంసీలు
పారిశ్రామిక నీటి సరఫరా	: 0.32 టీఎంసీలు
ఇందుకు అవసరమైన విద్యుత్	: 495.55 మెగావాట్లు
స్థిరీకరించిన ఆయకట్టు	: 5,56,722 ఎకరాలు
సాగులోకి వచ్చిన ఆయకట్టు	: 3,16,634 ఎకరాలు
2005–06లో ప్రాజెక్టు అంచనా వ్యయం	: రూ.6016 కోట్లు
2008–09లో సవరించిన అంచనా వ్యయం	: రూ.9427.73 కోట్లు
2016–17లో సవరించిన వ్యయం	: రూ.13445.44 కోట్లు
సవరించిన వ్యయ ప్రతిపాదనలు	: రూ.14729.98 కోట్లు
అయిన మొత్తం ఖర్చు	: రూ.14,188 కోట్లు
ప్రతిపాదనల్లో తాజా అంచనా వ్యయం	: రూ.17,500 కోట్లు

ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలి..
దేవాదుల ప్రాజెక్టు వెంటనే పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా.. ఇరవయ్యేళ్లవుతున్నా అసంపూర్తి ప్రాజెక్టుగానే ఉంటున్నది. అలాగే రెండువేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే నక్కలతూముకు కాల్వలు నిర్మించి నీటిని సరఫరా చేయాలి.


- బొడ్డు ప్రతాప్, రైతు, ధర్మసాగర్

భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది..
ప్రభుత్వ మార్గదర్శకాలు, కలెక్టర్ ఆదేశాల మేరకు భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. జనగామ జిల్లాలో 200 మంది రైతులకు టోకెన్లు ఇచ్చాం. మిగతా ప్రాంతాలు, గ్రామాల్లోనూ మాట్లాడుతున్నాం. 2026 మార్చి నాటికి పూర్తి చేయడం లక్ష్యంగా రైతులను సంప్రదించి భూసేకరణ చేస్తున్నారు.
- సుధాకర్, ఎస్ఈ, దేవాదుల ప్రాజెక్ట్

ఆర్చరీ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కాటారం: మండలకేంద్రానికి చెందిన రామిళ్ల రాజశేఖర్ కుమార్తె రామిళ్ల అనయ ఆర్చరీ విభాగంలో రాణిస్తుంది. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని కొల్లూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అనయ మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ గెలుచుకుంది. దీంతో నిర్వాహకులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 17న గుంటూరులో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో అనయ పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రామారావు, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పవన్ కళ్యాణ్ పాల్గొని మెడల్ అందజేశారు. అనయను కోచ్ శ్రీనివాస్, అభిషేక్ అభినందించారు.


రామిళ్ల అనయ

నేడు ఏనుమాముల మార్కెట్ పునఃప్రారంభం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ నేడు(సోమవారం) పునఃప్రారంభం కానుంది. ఐదు రోజులు వరుస సెలవులు రావడంతో మార్కెట్‌లో నిలిచిన క్రయవిక్రయాలు తిరిగి ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున మిర్చి తరలివచ్చే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

9న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించే టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు పురస్కారంతో పాటు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు పేర్లు నమోదు, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ

కాళోజీ సెంటర్ : 2024 -డీఎస్సీ ద్వారా ఎంపికై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులకు ఈనెల 4 నుంచి 6 వరకు వరంగల్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న 602 స్కూల్ అసిస్టెంట్లు శిక్షణలో పాల్గొనాలని ఆయన సూచించారు. వరంగల్‌లోని రంగశాయిపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీలు, పీఈటీలకు, వరంగల్ కరీమాబాద్‌లోని జీహెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, బయో సైన్స్ స్కూల్ అసిస్టెంట్లకు, వరంగల్ శంభునిపేట జీహెచ్‌ఎస్‌లో సాంఘిక శాస్త్రం, గణితం, హిందీ స్కూల్ అసిస్టెంట్లు, హిందీ భాషా పండితులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు తాము బోధించే సబ్జెక్ట్ బుక్స్ వెంట తీసుకొచ్చుకోవాలని డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మడికొండ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం నష్కల్ గ్రామానికి చెందిన కన్నెగంటి రాజు తన కుమారుడు అఖిల్‌తో కలిసి ఆటోలో కాజీపేటకు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మడికొండ పోలీస్ స్టేషన్ సమీపంలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ఆఫీస్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

- పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఉద్యానశాఖ అధికారి (టెక్నికల్) రాకేశ్

చెన్నారావుపేట : ప్రస్తుతం మామిడి కాయలు పూత, పిందె దశలో ఉన్నాయి. ఈ దశలో రైతులు చేపట్టే యాజమాన్యం పైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుంది. తెలిసి తెలియక ఈ దశలో రైతులు పొరపాట్లు చేస్తే దిగుబడి నాణ్యతపై ప్రభావం చూపుతుందని వరంగల్ ఉద్యాన శాఖ అధికారి (టెక్నికల్) రాకేశ్ తెలియజేశారు.

మామిడిలో పూత నుంచి గోళికాయ దశ వరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి సూచనలు చేశారు. తేనె మంచు పురుగులు, చెట్ల మొదళ్లలో, బెరళ్లలో దాగి ఉంటాయని, పూత సమయానికి ఇవి చెట్టు పై ఎగబాకి పూత గుత్తులను ఆశించి నష్టపరుస్తాయని వివరించారు.

- **పూత, కాయ దశ :** ఈ దశలో తేనెమంచు పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు, మసి తెగులు విపరీతంగా ఆశిస్తాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్లను మాంకోజెబ్ లీటర్ నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి.
- **పచ్చి పూత దశ :** అంత్రక్రోస్, బూడిద తెగులు, మసి తెగులు వ్యాపిస్తాయి. నివారణకు బుప్రోఫెజిన్ 25 శాతం ఎస్‌సీ 1.5 మిల్లీలీటర్ నీటిలో కలిపాలి. అలాగే హెక్సాకొనోజోల్ 2 మిల్లీలీటర్లను అజాడిరక్టిన్ 1500 పీపీఎం 2.మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- **నల్లపూత దశ :** తేనె మంచు పురుగు, తామర పురుగులు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు ఆశిస్తాయి. నివారణకు బుప్రోఫెజిన్ 20 శాతం, ఎసిఫేట్ 50 శాతం డబ్ల్యూపీ 1 గ్రాము, లీటర్ నీటిలో, థయోఫినేట్ మిథైల్ 1 గ్రాము లేదా కార్బెండజిమ్ 12 శాతం మాంకోజెబ్ 63 శాతం డబ్ల్యూపీ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **గోళిదశ నుంచి నిమ్మకాయ దశ:** ఈ దశలో తొడమ కుళ్లు తెగులు ఆశిస్తుంది. నివారణకు డైనైపురాన్ 20శాతం ఎస్‌జీ 0.2 గ్రాములు లీటర్ నీటికి అజాక్సిస్ట్రోబిన్ 23 ఎస్‌సీ 1 మిల్లీలీటర్లు లేదా టెబ్యూకోనజోల్ 50 శాతంను ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్ 25 శాతం డబ్ల్యూజీ గ్రాము.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.



రాలుతున్న మామిడి పూతను చూపుతున్న అధికారులు

ఎరువుల వాడకం..

- 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు రెండోసారి ఎరువులు, యూరియా కేజీ, పొటాశ్ 750 గ్రాముల చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చి నెలలో నీటి తడులను 15 రోజుల కొకసారి ఇవ్వాలి. డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులు ప్రతీ రోజు చెట్టుకు 60–90 లీటర్ల నీటిని ఇవ్వాలి.

కాయలకు కవర్లు తొడగడం..

మామిడి కాయలు పెద్ద నిమ్మకాయ సైజు దశలో ఉన్నప్పుడే వాటికి కవర్లు వాడాలి. నాణ్యమైన కాయలు పొంది ఎగుమతి చేయడంతో అధిక ధర లభిస్తుంది. అలాగే, పండు ఈగ, కాయ తొలుచు పురుగులను నివారించొచ్చు. మామిడి కాయలను ఎక్కువ కాలం చెట్టుపై నిల్వచేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్మడానికి వీలవుతుంది.

కాయలు వృద్ధి చెందే దశలో జాగ్రత్తలు..

నీటి వసతిలేని మామిడి రైతులు 20 గ్రాముల యూరియా, లీటర్ నీటికి లేదా 10 గ్రాములు మల్టీ-కేను లీటర్ నీటికి లేదా 10 గ్రాములు, 19:19:19 లీటర్ నీటికి చొప్పున కలిపి ఆకులు తడిచేలా కాయలతో ఉన్న చెట్లకు మాత్రమే పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయడం ఉత్తమం.

ఖాధర్, బెంగళూరు, నీలం రకంపై వచ్చే ఎండ బొబ్బ, బెంగళూరు, నీలం రకాల్లో కీలు కాయలను నివారించడానికి 20 గ్రాములు పొడిసున్నం లీటర్ నీటికి కలిపి కాయలపై పిచికారీ చేయాలి.

ఇవి పాటించాలి

తెల్లపూత దశలో అనగా పూలు వచ్చే దశలో రసాయన మందులను పిచికారీ చేయకూడదు. ఎందుకంటే పరాగ సంపర్కానికి దోహదపడే ఈగలు, తేనేటీగలు చనిపోవడం, వాసనకు పూల దగ్గరకు రాకుండా ఉండడం జరుగుతుంది.

పోస్టల్ సేవలు ప్రియం..

భారీగా పెరిగిన తపాలా ధరలు

- భారం కానున్న పుస్తకాల రవాణా
- తగ్గించాలని పాఠకుల డిమాండ్

కాజీపేట: ఉత్తరాలు, మనీ ఆర్డర్ల బట్వాడ నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరించిన తపాలా శాఖ.. బుక్‌పోస్టులపై ధరలు పెంచింది. దీంతో వార, పక్ష, మాస ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడపై ధరలు భారీగా పెరగడంతో పాఠకులు ఆందోళనకు గురవుతున్నారు. బుక్ సర్వీస్ పేరుతో ఇంత కాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాలు పాఠకుడికి అందించే సౌకర్యం ఉండేది. ఇటీవల ప్రస్తుతమున్న ధరలను రెంట్టింపు చేయడంతో పుస్తకాల రవాణా పాఠకుడికి భారంగా మారనుంది. మూడు రకాల బుక్ పోస్టులను ఒకే విభాగం కిందకు తెస్తూ ప్రింటెడ్ బుక్‌పోస్ట్, రిజిస్టర్ బుక్‌పోస్ట్‌గా మార్చి సేవల ధరలు పెంచింది. ఈ నేపథ్యంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్టు కార్డులను ఒకే విభాగం కిందకు తీసుకొచ్చారు. రిజిస్టర్ బుక్‌పోస్ట్ కాలమ్‌ను గతేడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి తొలగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తపాలా ఉద్యోగులతో పాటు పాఠకులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ నిర్ణయం దిన, వార, పక్ష, మాస పత్రికల బట్వాడపై తీవ్ర ప్రభావం చూపనుంది.

పెరిగిన ధరలతో పోలిస్తే...

పెరిగిన తపాలా ధరలతో పోలిస్తే ప్రైవేట్ కొరియర్ సేవలు మేలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిన్న, మొన్నటి వరకు తక్కువ ధరకే సేవలు అందించిన తపాలా శాఖ.. ఆదాయం పెంచుకోవడం కోసం ఇలా చార్జీలు పెంచడం చర్చనీయాంశంగా మారింది. దీనికన్నా ప్రైవేట్ కొరియర్ సర్వీస్ సేవలే మేలని వినియోగదారులు అంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే 5 కిలోల బరువు ఉన్న పార్సిల్‌కు గతంలో రూ.80 చెల్లించేవారు. ప్రస్తుతం అదే బరువు ఉన్న పార్సిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోంది. రిజిస్టర్ బుక్ పోస్ట్ ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీస్‌ను తపాలా శాఖ రద్దు చేయడంతో తప్పని పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్సిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువైన పుస్తకాన్ని పాఠకుడు పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే రూ.80 చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలు తెప్పించుకునే వారు ఎవరుంటారనే ప్రశ్న తలెత్తుతుంది.

దిగుమతి సుంకంపై ఆందోళన..

శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి విధించడం మరింత ఆందోళనకు గురి చేసే అంశం. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై కేంద్ర ప్రభుత్వం తొలిసారి దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం సరికాదనే వాదనలు వినపడుతున్నాయి.



కాజీపేట పోస్టాఫీస్

బుక్‌పోస్ట్	పాత ధర(రూ.)	కొత్త ధర (రూ.)
100 గ్రాములు	22.00	28.00
కేజీ	27.00	92.00
2కేజీలు	43.50	168.00
3 కేజీలు	56.40	234.00
4 కేజీలు	67.00	304.00
5 కేజీలు	80.00	365.00

పుస్తకాలకు దూరం చేయడమే..



ప్రభుత్వ నిర్ణయంతో పాఠకులు పుస్తకం చదివే అలవాటుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిపోయి ధరలు పెంచడం బాధాకరం. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

\- మోడెం రాజేందర్ గౌడ్, మడికొండ

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఏటూరునాగారం : అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను ఆదివారం తెల్లవారుజామున ములుగు జిల్లా ఏటూరునాగారంలో వై జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్సై తాజొద్దీన్ కథనం ప్రకారం.. ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా చర్ల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు కంటైనర్లు, ఒక డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. రహదారి కొనుగోలు అనుమతులు లేకుండా కిక్కిరిసి కట్టేసి ఆహారం (మేత), తాగునీటి సౌకర్యం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా 60 పశువులను తరలిస్తుండడంతో పట్టుకున్నామన్నారు. లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఎండి. ఈసా, మారపాక రాజు, ఎండి. అజిత్‌అలీఖాన్, జియాముద్దీన్, లకావత్ బాలరాజు, సాంబశివుడిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతూ పశువులను రాంపూర్ గోశాలకు తరలిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తాజొద్దీన్ హెచ్చరించారు.



పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనం

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

- మానుకోటలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య సమస్యల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లాలోని కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ శివారు గోప్య తండాకు చెందిన మూడ్ లచ్చిరాం (43) మూడేళ్లుగా అనారోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి వచ్చి శనివారం మధ్యాహ్న సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలికి చేరుకుని హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లచ్చిరాం రాత్రి సమయంలో మృతి చెందాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ దామోదర్ శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు సీఐ దేవేందర్ ఆదివారం తెలిపారు.

ఫోన్ చూస్తున్నావని మందలించినందుకు..

- పిల్లలను తీసుకుని వెళ్లిపోయిన గృహిణి

మహబూబాబాద్ రూరల్ : ఓ గృహిణి తరచూ ఫోన్ చూస్తుండడంతో ఆగ్రహానికి గురైన భర్త మందలించడంతో ఆమె.. కుమారుడు, కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య రోజా తరచూ ఫోన్ చూస్తుండడంతో అలా ఎందుకు చేస్తున్నావని భర్త మందలించాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఆమె తన కుమారుడు, కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం భర్త మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కే.శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ఉత్సవం

- ప్రతిబింబించిన తెలంగాణ, కేరళ రాష్ట్రాల సంస్కృతి



కళాకారుల ప్రదర్శనలు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ, కేరళ రాష్ట్రాల సాంస్కృతిక ఉత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలు జరుపుతున్నారు. కేరళకు చెందిన కళారూపాలు కొల్కలి, ముటిపాటు, తిరువతిర తదితర సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ, బోనాల విశిష్టతను తెలియజేస్తూ యువతులు ప్రదర్శనలిచ్చారు. జన్ను భరత్, భాస్కర్ సారథ్యంలో డప్పులతో ప్రదర్శన, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వారి బతుకమ్మ, పింగిళి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల బోనాలు, పోతురాజు, హనుమకొండ వాగ్దేవి కాలేజీ విద్యార్థి అమ్మవారి వేషధారణ, కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వరంగల్ నెహ్రూ యువ కేంద్ర, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. స్పాన్సర్లుగా కూరపాటి హాస్పిటల్స్, లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్, అభయ హాస్పిటల్స్, ముక్తి లేజర్ ఫైల్స్ క్లినిక్ వ్యవహరించాయి. కేయూ ప్రొఫెసర్ మల్లారెడ్డి, డాక్టర్ కూరపాటి రమేశ్, డాక్టర్ గౌతమ్, నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతం, వరంగల్ జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులకు బహుమతులు ప్రశంసపత్రాలు అందజేశారు.



నుక్కడ్ నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వసంతోత్సవానికి వీడ్కోలు..

- నిట్‌లో ముగిసిన 'స్ప్రింగ్ స్ప్రీ–25'



పెయింటింగ్ పోటీల్లో విద్యార్థులు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన వసంతోత్సవం 'స్ప్రింగ్‌స్ప్రీ–25' వేడుకలు ఆదివారం ముగిశాయి. దేశ వ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు సంస్కృతీసంప్రదాయలను పరస్పరం పంచుకోవడంతో పాటు వివిధ రకాల కళలను ప్రదర్శించారు. ముగింపు వేడుకల్లో పోలరాయిడ్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ, క్యూ ఫ్యాక్టర్, థింక్ డ్రాప్ రివీల్, పిక్చర్ ఫజిల్, సోలో ఐడల్, నుక్కడ్ నాటక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి సింగర్ నిఖిల్ డిసోజా పాటలతో హోరెత్తించారు.

సామాజిక రుగ్మతలపై అటాక్..నుక్కడ్ నాటక్..

నేటి సమాజంలో చోటు చేసుకుంటున్న సామాజిక రుగ్మతలపై ధైర్యంగా పోరాడేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు కల్చరల్ ఫెస్ట్‌లో అటాక్ నుక్కడ్.. నాటక్ పేరిట నాటక ప్రదర్శన నిర్వహించారు. ఇదీ ఎంతో ఆకట్టుకుంది.

నాతో పోటీనా..?

స్ప్రింగ్‌స్ప్రీ–25 వేడుకల ముగింపులో భాగంగా చెస్‌లో నాతోనే పోటా అంటూ పోటీల్లో విద్యార్థులు తల పడ్డారు. నువ్వా..? నేనా? నేను వేసే ఎత్తుతో నువ్వు చిత్తు అంటూ ఆటలో మెదడుకు మేత పెట్టి పోటీల్లో విజయం సాధించారు.





సోలోగా పాడేద్దాం.. సోలోగా వాయిద్దాం..

వసంతోత్సవ వేడుకల ముగింపులో సంగీత విభావరిలో విద్యార్థులు వినూత్నంగా పాటలు పాడుతూ అలరించారు. నేను సోలోగా పాడుతా.. నువ్వు సోలోగా గిటార్ వాయించు అంటూ పోటీ పడ్డారు.

కూరగాయలకు 'షేడ్ నెట్'

సాగులో మెళకువలు పాటిస్తే అధిక లాభాలు

- ఉద్యాన శాఖ అధికారి శాంతిప్రియ
- వేసవిలో సాగులో రైతులకు పలు సలహాలు, సూచనలు



శాంతిప్రియ

మహబూబాబాద్ రూరల్ : షేడ్‌నెట్ హౌస్‌లో కూరగాయల సాగు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. తక్కువ పరిమాణంలో నీటి అవసరం ఉంటుంది. అలాగే, ఎండ, వానా, చలికాలల్లో నుంచి పంటకు రక్షణ కలుగుతుంది. దీంతో కూరగాయలు తాజాగా ఉంటాయి. ప్రధానంగా వేసవిలో ఈ సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు, లాభాలు పొందొచ్చు. ఈ నేపథ్యంలో ఈ విధానంలో ఎలా సాగు చేపట్టాలి.. ఏ విత్తనాలు అనుకూలం.. ఏ ఎరువులు వేయాలనే వివరాలు ఉద్యానశాఖ అధికారి శాంతిప్రియ తెలిపారు. ఈ మేరకు ఆమె రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

నాటేందుకు అనువైన మొక్కలు..

లేత మొక్కలు 5 నుంచి 6 వారాల వయస్సు ఉన్నవి షేడ్‌నెట్‌లో సాగుకు అనుకూలంగా ఉంటాయి.

అనువైన రకాలు..

టమాటలో సిన్‌జెంటా, హిమ్‌సోనా, హిమ్‌షేక్, ఇన్‌సోనా మొదలైనవి. చెర్రీ టమాటలో మోస్‌సాంట్, ఓల్ఫ్, రైస్, అంతేకాకుండా హరియాణా అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ వారు అభివృద్ధి చేసిన రకాలు కూడా అనువైనవి.

ఎరువులు..

భూమి రకం, మొక్కను బట్టి ఎరువులు వాడుకోవాలి. ఉత్తమ ఫలితాల కోసం, దిగుబడుల కోసం 4 నుంచి 5 టన్నుల వరకు బాగా మాగిన ఎరువులు, 40 నుంచి 95 కేజీల నత్రజని, భాస్వరం , 40 నుంచి 45 కేజీల పొటాశ్ వేసుకోవాలి. సగం నత్రజని, పొటాశ్ ఎరువులతోపాటు మొత్తం భాస్వరం ఎరువు భూమి తయారు చేసేటప్పుడు వేయాలి.

మేలైన పద్ధతులు..

➤ సక్కరింగ్...



షేడ్‌నెట్‌లో సాగైన టమాట పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి శాంతిప్రియ

మొక్కనుంచి కిందగా పెరిగే, గుబురుగా ఉండే కొమ్మలను తీసివేయాలి. కాండం సులువుగా పెరిగేలా చూసుకోవాలి.

➤ **మొక్కకు ఊతమివ్వటం..**

మొక్కలు నాటిన అనంతరం ట్విన్ దారం/సన్నని ప్లాస్టిక్ వైరుతో గాని ఊతంగా కట్టాలి. భూమి నుంచి కనీసం 3 మీటర్ల ఎత్తు సమాంతరంగా వైర్లు కట్టుకుని, ఊతంగా వాడిన వైర్లు దానికి కట్టాలి. (ట్రెల్లిస్ పద్ధతి)

పరాగ సంపర్కం..

షేడ్‌నెట్ హౌస్ ద్వారా కృత్రిమ పద్ధతిలో పరాగ సంపర్కం జరుగుతుంది. బ్రష్ ద్వారా పూల గుత్తుల మీద రుద్దడం ద్వారా (వారిని రెండుసార్లు చొప్పున) కాయలు కట్టడానికి తోడ్పాటు చేయాలి.

డీ లీఫింగ్..

ఆకులు ఎక్కువగా భూమిని తాకినప్పుడు రకరకాల ఫంగస్ సోకే అవకాశం ఉంటుంది. అందుకే ఎక్కువగా ఆకులు ఉన్నప్పుడు తీసివేయడం ద్వారా చక్కని సూర్యరశ్మి, గాలితోపాటు ఫంగస్ కూడా అరికట్టొచ్చు.

ఫ్రూట్ ప్రూనింగ్..

సైజు పూర్తిగా ఎదుగుదల కాని కాయలను తీసివేయడం ద్వారా నాణ్యమైన పెద్ద సైజు ఉన్న కాయలు దిగుబడిగా పొందొచ్చు.

నీరుపారించడం...

➤ సాధారణంగా 4 నుంచి 6 రోజుల వ్యవధిలో నీరు పారించాలి. మొక్కల ఎదుగుదలకు, వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీరు పెట్టాలి.

➤ సకాలంలో ఎరువులు వేయడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం లాంటి పద్ధతులను అవలంబిస్తే సుమారు నాటిన 90 రోజులనుంచి కాపుకు వస్తుంది.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై గన్‌మెన్ దాడి

వరంగల్ : వరంగల్ బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా ఎస్సై గన్‌మెన్ తమపై దాడికి పాల్పడ్డాడని సంగెం మండలం కృష్ణానగర్‌కు చెందిన గోపతి శ్రీకాంత్, మేకల సాంబరాజు తెలిపారు. వారి కథనం ప్రకారం.. వివాహ వేడుకల్లో పాల్గొన్న అనంతరం బైక్‌పై వెళ్తుండగా పోలీసులు.. శ్రీకాంత్, మేకల సాంబరాజుకు బీత్ ఎనలైజర్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో సాంబరాజుకు 109 శాతం వచ్చింది. దీనికి సంబంధించిన రశీదును ఇచ్చి కోర్టులో జరిమానా చెల్లించి వాహనం తీసుకెళ్లాలని ట్రాఫిక్ ఎస్సై యాదగిరి సూచించారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాన్ని తీసుకెళ్తున్న సమయంలో శ్రీకాంత్ తన సెల్‌ఫోన్‌లో ఫొటో తీశాడు. దీంతో ఎస్సై గన్‌మెన్ వచ్చి దుర్భాషలాడుతూ శ్రీకాంత్ చేయి చేసుకున్నాడు. ఫొటో తీస్తే కొడతారా అని సాంబరాజు ప్రశ్నించడంతో అతడిపై కూడా దాడి చేశాడు. ఇంత జరుగుతున్నా ఎస్సై స్పందించలేదని బాధితులు వాపోయారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడితే జరిమానా వేయాలే తప్ప భౌతికదాడికి పాల్పడడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు గన్‌మెన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్, సాంబరాజు కోరారు.